# బ్రతకనేర్చిన డాక్టరు

రచన:
కె. వీరభద్రరావు, బి.ఎ. బిఇడి.

అది ఒక కుగ్రామం. పేరు కాట్రగుంట. నెల్లూరుకు 18 కి. మీ. దూరంలో ఉన్నది, ఆ ఊళ్ళో ఒక ధర్మాసుపత్రి, ఒక పాఠశాల నామకః ఉన్నాయి. నామకః అని ఎందుకన్నానంటే: పశువులపాకను పోలి 60 మంది విద్యార్థులు ఒక టీచరుతో కూడిన ఆ బోర్డు స్కూలు, దీనా వస్థలో రేపో మాపో కూలిపోతుందన్న ఒక గదిలో ధర్మాసుపత్రి, దానికి ఒక మెడికల్ ఆఫీసర్, ఒక కాంపౌండర్.

ఆంధ్రా యూనివర్సిటీ MBBS డిగ్రీ తీసుకుని రెండు సంవత్సరాలయినా ఉద్యోగం రాదేమిటి చెప్మా అని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్న నాకు 'పోస్టు' అన్న కేకతో ఈ లోకంలోనికివచ్చి లెటర్ చించిచూశాను. ఆశ్చర్యం. 'నాకు ఉద్యోగం వచ్చింది' గట్టిగా అరుస్తూ ఇంట్లోకి వెళ్ళి అమ్మా, నాన్న, వాళ్ళతో చెప్పాను. కాని నా ఆనందం ఎన్నో నిమిషాలు లేదు. ఎందుకంటే ఏ వైజాగో; హైదరాబాద్‌లోనో ఉద్యోగం వస్తుందని ఆశిస్తున్న నాకు 'కాట్రగుంట'లో ఉద్యోగం రావడం నిరాశా నిస్పృహలనే కల్పించిందని చెప్పవచ్చు.

* * *

నేను జాయిన్ అయ్యే ముందురోజు కాట్రగుంట బయలుదేరి వెళ్ళాను, నేను చదువుకునేటపుడు నా క్లాస్‌మేట్ ఒకడు కాట్రగుంటవాడం అవడంవలన ఆ ఊరిగురించి ముందే నాకు తెలుసు. సాయంత్రం చీకటిపడేవేళ. పశువులు యింటికి చేరేవేళ. పక్షులు గూళ్ళకు పోయేవేళ. ఒక పశువులవాడు పశువులను తోలుకొంటూ ఇటే వస్తున్నాడు. 'బాబూ! కాట్రగుంటకి పోయేదారి ఎటు' ప్రశ్నించాను. 'నాతో రండయ్యా' సమాధానం. మాట్లాడకుండా టార్చిలైటు వెలుతురులో అతని వెనకాలే వెళ్ళాను. దారికి ఇరుప్రక్కల కొబ్బరితోట. చాలాదూరం నడిచాము. 'ఎవరింటికి బాబూ!' ప్రత్యర్థి ప్రశ్న. 'కరణం వారింటికి' చెప్పాను. అతను మాట్లాడలేదు. ఒక మర్రిచెట్టు వచ్చింది. ఇప్పుడు కొంచెం లైట్లు అక్కడక్కడ కనపడుతున్నాయి. ఆ కరంటుదీపం కనబడేదే కరణం గారిల్లు' అని చెప్పి అతను పశువులను ఇంకోదిశలో తోలుకుని వెళ్ళిపోయాడు. టైము చూసుకున్నాను. 7-30 ని॥లు అయింది. ఎంతో రాత్రయినట్లుగా ఉంది, జనసంచారం బొత్తిగా లేదు.

కరణంగారింటిముందుకు వెళ్ళాను. ఎవరో కుర్చీలో కూర్చుని చుట్ట కాలుస్తున్నారు. బహుశా ఈయనే ఈ ఊరికి కరణం అయివుంటాడు. 'ఏమండీ, కరణంగారిల్లు ఇదేనా?' 'నా ప్రశ్నకు తన భారీశరీరాన్ని కదపకుండా ఒక్క తలనుమాత్రమే నా వైపుకు త్రిప్పి నన్ను పైనుంచి క్రిందవరకూచూసి 'అవును ఎవరు కావాల' అని సమాధానమిచ్చాడు. 'నాపేరు అంజనేయులు సార్' ఈ ఊరికి గవర్నమెంటు డాక్టరుగా వచ్చాను' ఎంతో వినయ విధేయతలతో చెప్పాను. దానికి కరణంగారు అదేం పెద్ద విచిత్రం కావట్లు ఒక చుట్టదమ్ము గట్టిగా లాగి తన ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోమన్నట్లుగా సైగ చేశాడు. కుర్చీలో కూర్చున్నాను. 'ఒరే రాముడూ, కరణంగారు బిగ్గరగా కేకవేశారు. గోచీ తలపాగా కలిగినవ్యక్తి 'అయ్యా, అని దండ కట్టుకుని కరణంగారి ఎదురుగా భక్తిప్రపత్తులతో నిలబడ్డాడు. 'ఆ మేడకి తాళాలుంటాయి అవి తీసుకొని ఈయన్ని హాస్పిటల్‌కు తీసుకువెళ్ళు' ఆజ్ఞాపించారు. 'అలాగే నండయ్యా' అని రాముడు తలఊపి ఇంట్లోకి వెళ్ళి తాళాలు తీసుకొచ్చి 'పదండి బాబూ' అన్నాడు. కరణంగారివద్ద సెలవు తీసికొని రాముడు వెనకాల నడుస్తున్నాను. ఇళ్ళు ఒక నాడివరస లేనట్లుగా కట్టినట్లున్నారు. విసిరేసినట్లుగా ఉన్నాయి. అక్కడక్కడ కరంటుదీపాలు కనబడుతున్నాయి. 3 సందులు తిరిగినతర్వాత ఒక యింటి ముందు ఆగి తలుపుతాళం తీసి లైటువేసి 'రండి బాబూ' అన్నాడు. నేను పరిసరాలను గమనిస్తూ గదిలో కుడికాలు మోపాను. ఒకటే గది. అందులో ఒక డ్రాయరు, రెండు కుర్చీలు ఉన్నాయి. మందు అన్నీ ఒక అలమరులో పేర్చి ఉన్నాయి. గది చిందర వందరగా ఉంది. ఒక సీలింగు ఫేనుకూడా ఉంది. గదికి ఇటు అటు రెండు వరండాలు. రెండు పొడుగు బల్లలు రోగులు కూర్చోడానికి ఉన్నాయి. గదిలో నా సామాను (ఒక సూటుకేసుమాత్రమే) పెట్టి కుర్చీలో చతికిలబడ్డాను. రాముడు ఇపుడే వస్తానని చెప్పి పైకి వెళ్లాడు.

* * *

ఏమిటో ఇక్కడ మనుషుల మనస్తత్వాలు బోధపడడం లేదు. కరణంగారు ముభావంగా మాట్లాడారు. రాముడు కొంచెం కొంచెం మాట్లాడాడు. మిగిలిన మనుషులు చూసీ చూడనట్లు పోతున్నారు. పల్లెటూరు ప్రజలు చదువుకున్న

వాళ్ళను గౌరవంగా చూస్తారని విన్నానే। గోడమీదబల్లి ఖాటోలు పురుగుని తినడంకోసం నానాయాతన పడుతోంది. ఇంతలో రాముడు కారేజ్ తెచ్చాడు. 'డాక్టరుగారూ, ఈ కారేజి కరణంగారు పంపారు. రేపు మిమ్మల్ని కలుస్తానని చెప్పమన్నారండీ' అని చెప్పినసమాధానంకోసం ఎదురు చూడకుండానే వెళ్ళిపోయాడు. కరణంగారు పంపిన కారేజి, నేను తెచ్చుకున్న బిస్కట్లు ఖాళీచేసి సిగరెట్టు ముట్టించి ఆలోచిస్తూ ఆ పొడుగాటిబల్లమీదే మేను వాల్చాను. అలవాటులేని ప్రదేశం అవడంమూలాన కొంచెం ఆలస్యంగా నిద్రపట్టింది.

పక్షుల కిలకిలారాగాలతో ఆవుదూడల అరుపులతో ప్రొద్దున్నే తెలివి వచ్చింది. రాముడువచ్చి తలుపుతట్టే నేను తలుపు తీశాను॥ రాముడు సహాయంతో కాలకృత్యాలు ముగించి కరణంగారింటివద్దనుండి వచ్చిన కాఫీ. టిఫెను ముగించి 10 గం॥ అయ్యేసరికల్లా మొట్టమొదటిసారిగా కాత్రగుంట ప్రభుత్వాసుపత్రిలో డాక్టరుగా అనగా ఆంజనేయులు MBBS గా అధికారహోదాలో కుర్చీలో కూర్చున్నాను. నావద్ద పనిచేసే కాంపౌండర్ ఒక క్రిష్టియన్ లేడీ. అని రాముడుద్వారా విని ఆవిడకోసం, రోగుల కోసం ఎదురుచూస్తున్నా, కాని ఒక గంటవరకూ ఎవరూ రాలేదు. 11 గం॥ కు గొడుగుకర్ర చప్పుడయితే ఆ దిశ వైపు బుర్ర పైకెత్తి చూశాను. కరణంగారు చుట్ట కాల్చుకుంటూ ఠీవిగా గొడుగుకర్ర ఊపుకుంటూ నావైపే వస్తుంటే కుర్చీలోంచి లేచి నిలబడి రెండుచేతులెత్తి నమస్కరించాను. నేను చూపిన వినయవిధేయతలను కరణంగారి వదనం వ్రేలితో కనబడినది. ఆయన ప్రతి నమస్కారంపెట్టి, ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నారు. ముందుగా నేనే 'రాత్రి మీరు పంపిన భోజనం బాగుంది'అంటూ పొగడ్తతో సంభాషణ ప్రారంభించాను, ఆయన ఆనందంతో ఉన్నట్లు' అనిపించగానే ఆయనగురించి నేను చాలా విన్నానని చేతికి ఎముకలేకుండా దానంచేసే దానకర్ణుడని, పేదలపాలిటి పెన్నిధులనీ తోటిమనిషి అవసరాలను ఆదుకునే సహృదయులనీ, ప్రభుత్వోద్యోగులపట్ల కరుణారసాలను చూపే మహామనీషనీ విద్యాసంపన్నులనీ (ఆ తర్వాత తెలిసింది. ఆయన ఐదుదాటి చదవలేదని) పొడిగి పొగిడి అలసిపోయి కరణంగారి ఆర్డరుమీదవచ్చిన కొబ్బరి నీళ్ళు త్రాగి ఆ పూటకు హాస్పిటల్ కట్టేసి కరణంగారింటికి భోజనానికి వెళ్ళాను.

నేను కాత్రగుంట ప్రభుత్వాసుపత్రిలో రెండేళ్ళుగా, డాక్టరుగా పని చేస్తున్నాను. ఇప్పుడు నేను కాత్రగుంటలో ఎంతో పేరుమోసిన దయార్ద్రహృదయంగల డాక్టర్ని. ఈ రెండేళ్ళుగా నాకొచ్చేజీతంలో నెలకు 100 రూ. లు మాత్రమే ఖర్చుచేసి మిగిలినదబ్బంతా మిగల్చ గలుగుతున్నాను, నాకంటే ముందు ఈ ఊరిలో పనిచేసిన డాక్టరు నెల రోజులకే జెండా ఎత్తేసాడని తెలిసింది. నలుగురూ అనుకుంటూ ఉంటే తెలిసింది॥ అతను కాంపౌండర్ సోసీ లేటుగా వస్తే గొడవపెట్టాడని అంచేత కరణంగారు అతన్ని ట్రాన్స్ఫరు చేయించేశాడని, ఎందుకంటే కరణంగారికి సోసీకి 'సంబంధం' ఉన్నది కనుకనే అంతే. సోసీ కరణంగారి కేండిడేటు అన్నమాట. నేను సోసీ లేటుగా వచ్చినా ఏమీ అనను. ఎందుకంటే నేను అనుకునేవాడిని, ఏ ఎండకు ఆ గొడుగు పట్టాలని. జనభాషలో చెప్పాలంటే బ్రతక నేర్చినవాడని. నా ఆదర్శాలను యిక్కడ ప్రవేశపెడ్తే నేను పాత డాక్టరులాగే శంకరగిరి మాన్యాలను పట్టేద్దును. నేను చిన్నప్పుడు చదువుకున్న సామెత 'Do in rome as Romans do' గుర్తుకువచ్చి సగర్వంగా నవ్వుకున్నాను. 'బ్రతకనేర్చిన డాక్టరునోయ్' అని కరణంగారు అప్పుడప్పుడు అంటూ ఉంటే మాటలు జ్ఞాపకం వచ్చి కరణంగారింటికి భోజనానికి బయలుదేరేవాణ్ణి.

TRADE MARK
MEXICO
KNITTING MILLS

ఎల్లప్పుడూ - మాచే తయారు చేయబడిన
♦ పావ్‌లిన్ ♦ విజయ్ ♦ సిల్వర్
♦ అనిన్ ♦ బాబి ♦ రోలెక్స్
బనియన్లనే వాడండి. అవి బనియన్లన్నిటికెల్లా అత్యుత్తమమైనది.

Phone: 22016
MEXICO KNITTING MILLS
43-A, Cauvery St—TIRUPUR-638 602